# నిరుడు కురిసిన హిమసమూహములు

మధ్యాహ్న సమయం... సూర్యుడు నడినెత్తిమీదున్నాడు... అయినా చలికాలమవడంవల్ల ఎండ తీవ్రత ఏమంత లేదు. ఎరువుల కంపెనీ నుంచి వస్తున్న బొళబొలా ధ్వనులు సి. యస్. పి నుంచి బొగ్గులోడ్ చేస్తున్న చప్పుడు. గనుల్లోంచి పేలుళ్ల ధ్వనులు. బొగ్గు పేలినప్పుడు భూకంపం వచ్చినట్టుగా భూమంతా అదురుతుంది. తలలమీద బొక్క టోపీలున్న సింగరేణి కార్మికులు మసిబట్టలతో కొందరు, సైకిళ్లపై కొందరు నడిచిపోతున్నారు... పొద్దు పొడవకముందే లేచి పారిశ్రామిక కాలనీల్లో పాలు, కూరగాయలు అమ్ముకోవడానికెళ్లిన శ్రామికజనాలు ఖాళీగంపలతో ఇండ్లకెళుతున్నారు. వాతావరణం బొగ్గు, దుమ్ము, ఎరువుల కంపెనీ నుంచి వస్తున్న పొగతో మిళితమై కృత్రిమ మేఘాలావరించినట్టుగా వుంది.

ఊరు బయట గుట్టలా వున్న మట్టి దిబ్బమీద నిల్చున్నాడు వెంకటనర్సయ్య. కళ్ళపైనుంచి చేతులడ్డంగా పెట్టి నలుదిక్కులా చూసాడు.

'ఓ సూర్య భగవానుడా! ఓ కర్మసాక్షీ! ఓ పంచభూతములారా! సహజత్వానికి భిన్నంగా ఏంటీకృత్రిమత్వం...? మా తాతలంతా ఒక్కటిగానే బతికారు... అన్నదమ్ములం వేరు పడినా ఉన్నంతకాలం కలిసిమెలసున్నట్టే ఉన్నాం... అయినా ఊరి కొకరుగా పోక తప్పలేదు. మరి నా పిల్లలు..? చెట్టుకొకరు పుట్టకొకరన్నట్టుగా పోవాల్సిందేనా...? ఎక్కడ తండ్రీనేను పుట్టిపెరిగిన ఊరివాళ్ళు...? నా చిన్ననాటి స్నేహితులు...? మరిప్పుడు? ఈ ఊరి వాళ్ళంతా చిల్లరగత్తురం కాక తప్పదా?'

చేతులెత్తి సూర్యుని దిక్కు చూస్తూ తనలో తాననుకున్నాడు. వెంకటనర్సయ్య...

'ఒకప్పుడీ నేల..? పచ్చని చెట్లు... పక్షుల కిలకిలారావాలు... లేగదూడల గెంతులు... మూగజీవాల సంచారాలతో... మరిప్పుడు?' తనలో తానే గొణుక్కున్నట్టనుకున్నాడు.

ఆ మట్టికుప్పల మీదనే కూర్చున్నాడు.

బొంయ్ బొంయ్ మంటూ ధ్వనులు, లారీల చప్పుడు వినబడుతూనే వున్నాయి...

''ఈ సమయంలో ఇక్కడ కూర్చున్నావేంటి...?''

ఎనభై ఏళ్ళ వయసుకు దగ్గరున్న వెంకట నర్సయ్యకు అప్పారావు ఆప్యాయమైన పలుకరింపుతో సాంత్వన లభించింది. మనసు ఆవేదనతో కళాసెళా కాగిపోతున్నప్పుడు దగ్గరి వాళ్ల ప్రేమపూరితమైన పలుకరింపుతో ఓదార్పునిస్తుంది.... తన చిన్నతనంలో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వెంకటనర్సయ్య సరైన ఆధారాలు చూపకపోవడంవల్ల సమరయోధుల పింఛను పొందడంలేదు... సింగరేణి బొగ్గుగనుల్లో

పనిచేస్తున్న కొడుకుతోపాటు పాతికేళ్లుగా ఆ ఊళ్లో ఉంటున్నాడు అప్పారావు... వాళ్ళిద్దరూ ప్రాణ స్నేహితులు... చుట్టాల చుట్టరికంతో ప్రారంభమైన వాళ్ల స్నేహం ప్రాణానికి ప్రాణమిచ్చేంతగా ఎదిగింది... ఆ వృద్ధులిద్దరూ రోజూ కల్సుసుకుంటారు. కష్టసుఖాలను కలబోసుకుంటారు.

మిత్రుని పలుకరింపుకు వెంకటనర్సయ్య కళ్ళవెంట నీరు కారింది...

''ఏంటి? ఆ కన్నీళ్ళేంటి?'' భుజం మీదచెయ్యేస్తూ అన్నాడు అప్పారావు...

''అప్పారావ్? నాకీ ప్రదేశాలను చూస్తుంటేనే దుఃఖ మాగడంలేదు. ఒకప్పుడిక్కడ ఎంత పచ్చదనముండేది...? ఇప్పుడు చూడు... ఎక్కడచూసినా బొగ్గుకుప్పలు... మట్టిరాశులు... గుంతలు... ఎక్కడైనా చెట్లున్నా బొగ్గుపొడికి, విషవాయువుల తాకిడికి మాడిపోతున్నాయి... ప్రకృతిలోని సమతుల్యత ఘోరంగా దెబ్బతింటుంది...'' కళ్లు తుడుచుకుంటూ అన్నాడు వెంకటనర్సయ్య...

ఆ మాటలాతని హృదయపు లోతుల్లోంచి వస్తున్నాయి...

ఆ మాటలతో అప్పారావుకాతని ఊరు జ్ఞాపకం వచ్చి మనసు బరువెక్కింది.

''అప్పారావ్! ఎక్కడో తూర్పుగోదావరి జిల్లాలో పుట్టినవాడిని... ఇక్కడికొచ్చి పాతికేళ్ళవుతున్నా నీకు మీ ఊరు జ్ఞాపకాలు పోలేదు. ఇప్పుడు ఈ ఊర్ని కూడా వదిలిపెట్టాల్సి వస్తుంది... మనలాంటి వాళ్ల కడుపుకోతనెవరర్థం చేసుకోవాలి?''

''ఈ దిక్కుమాలిన ఆరాటాలు, ఉరుకులు పరుగుల మధ్య మనతరం వాళ్ల ఆలోచనల నెవరర్థం చేసుకుంటారు...? ఎవరూ అర్థం చేసుకోరు వెంకటనర్సయ్యా!''

తల పట్టుకుంటూ అన్నాడు అప్పారావు.

''అప్పారావ్! నేనే ఊళ్ళో ఉంటే ఆ ఊరు మునిగిపోక తప్పదేమో ననిపిస్తుంది... మా తాతముత్తాతలు తరతరాల్నుంచీ కరీంనగర్ పట్టణానికి దగ్గరున్న సంగెం గ్రామంలో ఉండేవారు... మా ఊరు మానేరు ముంపుకు గురయింది... మేమంతా గొడగొడా ఏడ్చాం... వలవలా వలపోసాం...''

కళ్ళు మూసుకొనున్న వెంకటనర్సయ్య కనుకొలుకుల్నిండి నీటి బొట్లు రాలుతున్నాయి. ధ్యానముద్రలో కూర్చొనున్నట్టున్న అతని కళ్ళముందు ప్రకృతి సౌందర్యంతో అలరారే అతని అందాల ఊర్కు, ఊరును వదిలిపెట్టాల్సిన పరిస్థితులు, అక్కడి ఆత్మీయతలు, అనుబంధాలు అన్నీ కదులుతున్నాయి. అతని మనసు ముప్పయి ఏళ్ల గతంలో కెళ్లింది.

★ ★ ★

మానేరు ముంపుకు గురవుతున్న ఊళ్లు ఖాళీ చేయాలని వచ్చిన నోటీసులు, ఊరి చాటింపులు ఆ ఊరివాళ్ల గుండెల్లో రాయిపడ్డట్టే చేసాయి. ఆ వార్త వాళ్లకు పక్కలో బాంబు పేలినంత ఆందోళన కలిగించింది. ఊరు ఊరంతా శోకమావరించింది. పుట్టి పెరిగిన నేలతో పెనవేసుకున్న అనుబంధాలు వాళ్ళను కంటికి ధారగా ఏడ్పిస్తున్నాయి.

''మా తాతముత్తాతల కాలం నుంచి ఉంటున్న ఊరు. ఊర్ను ఇడిచి ఎక్కడికిపోవడం...?''

''ఎక్కడికో ఓ కాడికి పోకుంటె మానేట్లపడి చావాలె...''

''సర్కారు వాళ్ళిచ్చే పైసలతోని ఎక్కడనన్న భూమి కొనుక్కోని బతుకాలె...''

''వీని పైసలింట్ల పీనుగెల్ల. అవ్వేమన్న కడుపుకు తాగేటియా...?''

నట్టేట్ల ముంచినట్టు చెయ్యవట్టిరేంది?

''అంతా యెవరకు రెండేండ్ల కెక్కోనే ఐతది... పైసలవ్వి దొరికెవరకు...''

''అప్పుడయిన పోవుడే కదు! పైసలు పాడుగాను.. పైసల కోసం తల్లినమ్ముకుంటమా?''

ఆ ఊరి వాళ్ళెవరి ముఖాల్లోను నెత్తురు చుక్కలు లేవు... అందరిలోనూ ఆందోళన. ఆ ఊరుమ రో రెండో మూడో ఊళ్లు తప్ప వేరే ఊళ్ల మొహం చూడనివాళ్ళూ వున్నారా వూళ్లో... చాలామందికి ఊర్నెలా వదిలిపెట్టడమని బెంగ పట్టుకుంది... నోటీసులొచ్చిన నెలరోజుల్లోనే ఇద్దరు వృద్ధులు కన్నుమూసారు...

''భూమంటే తల్లికంటెక్కువే...''

''వాడు ఎకరానికిచ్చే డబ్బుతోని కరీంనగర్ల గుంటభూమి గూడరాదు...''

''ఇండ్లను ఖాళిజెయ్యమనటానికెవ్వడు? పుచ్చెలెగిరిపోవాలె...''

''బాగనే మాట్లాడుతున్నవు. సర్కారు తలుచుకుంటె ఏమైన జేత్తరు...''

''డ్యాంకింద వేల ఎకరాల భూమి సాగుకొస్తంది... పంటలు పండుతయి... గవర్నమెంటు వట్టిగనే సొమ్మంటుందా ఊరిడిసి? పైసలియ్యనే వట్టె...''

''వేలెకరాల పంట భూములు గూడ నీళ్ళల్ల కలిసిపోతన్నయి...''

రోజూ ఊళ్ళో చర్చలు జరుగుతూనే వున్నాయి... ఊరి వాళ్ళంతా తమ బాధలను ఒకరితో ఒకరు చెప్పుకుంటున్నారు... కళ్ళనీల్లు తీసుకుంటున్నారు... ఆ ఊరివాళ్లెవరి ముఖాల్లోనూ కళనేదే లేకుంటయింది...

''ఊరంటె కేవలం చెట్లు గుట్టలు, మట్టి ఇండ్లు ఇవే అనుకుంటున్నారు... అందుకే ఒక్క కలం పోటుతో ఖాళీ చేయమని ఆదేశాలిచ్చారు. ఊరంటే మనుషుల మధ్య సంబంధాలు... ప్రేమలు... బంధాలు అనుబంధాలు... తరతరాల మానవ సంబంధాలు. పరస్పర అవగాహనలని ఈ కలం పోటుగాళ్ళకేం తెలుసు...?'' అన్నాడు వెంకటనర్సయ్య.

''వెంకటనర్సన్న మంచి తెలివికలోడు... అప్పుడే నాలుగో ఐదో చదివిండు... సస్వతంత్రం కోసం పోట్లాడిండు... సర్కారోల్లు పించనియ్యకున్నా పదెకరాల పరం పోగు భూమిని మాపెడితె సాగుజేసుకుంట బతుకుతండు.... అయినె తలుసుకుంటె సర్పంచో, ఏదన్నా లీడరో మా అయెటోడు... కాని భూమిని నమ్ముకొనే బతుకుతుండు.. ఆయినె మాటలు కొన్నినా అసోంటోనికి అర్థమేకావు...'' అన్నాడు వీరేశం...

ఊళ్లోకి కొత్త కొత్త వాళ్లొస్తున్నారు... పాంటు బుషర్టుల వాళ్లు, తెల్లబట్టలవాళ్లొచ్చి డబ్బులిప్పిస్తామని కాగితాలమీద సంతకాలు పెట్టించుకొని పోతున్నారు. కరీంనగర్ నుంచి వచ్చే పైరవీకార్లతోపాటు ఊళ్లోను కొందరు పైరవీకార్లు పుట్టుకొస్తున్నారు.

అంతకుముందెప్పుడూ రాని స్కూటర్లు, కార్లు ఊళ్ళోకొస్తున్నాయి...

ఆ ఊళ్లో అన్ని కులాలవాళ్ళూ వున్నారు... అనేక వృత్తులవాళ్లున్నారు... వివిధరకాల ఆర్థిక స్థితిగతులవాళ్ళున్నారు... అయినా తరతరాలుగా కలిసి సహజీవనం చేస్తున్న ఆ కుటుంబాల మధ్య చక్కని సహజీవనం కొనసాగుతుంది. ప్రేమబంధం కొనసాగుతుంది... ఇప్పుడా బంధాన్ని, ఇతర సంబంధాలను తెంచుకొని చెట్టుకొకరు పుట్టకొకరుగా పోవాల్సి వస్తున్న పరిస్థితులు వాళ్ళకు గుండె కోతగా వున్నాయి. ఎంత గుండె కోతగా వున్నా ఊరును వదలడం తప్పదని తేలింతర్వాత తాము స్థిరపడే ప్రదేశాలను

వెతుక్కుంటున్నారు వాళ్లు... ఈ సమయంలోనే జిల్లా కేంద్రంలో ఇళ్ళ స్థలాల రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి... ప్లాట్ల నమ్ముకుంటూ లక్షలు గడించడానికి కొంతమంది మారు బేరగాళ్లూ తయారయ్యారు.

మరికొన్ని నెలల్లో ఊర్లు ఖాళీ చేయడం ప్రారంభమైంది.

''నాకున్నదే కొంచెమంత భూమాయె... ఆ భూమికేం పైసలచ్చినయి? కరీంనగర్‌ల ఊరవతల ప్లాటు కొనుక్కున్న... దాంట్లో రేకుల పెడ్డేసుకొని బతుకుత...'' అన్నాడు కనకయ్య.

'''కూలోనాలో చేసుకుంటె పొట్టగడువదా? ఇండ్లు గట్టే పనులకు కూలి పని మా దొరుకుతది... ఓ మేస్త్రి పని చూపెడుతనన్నడు...''

''నువ్వేం జేస్తవు గట్టయ్య కరీంనగర్ పోయి...'' అడిగాడు సర్పంచ్.

''నాగలి కాన్నుంచి మొదలుపెట్టి బాలెడు జోల్లదాక ఎవుసపు సామాన్లన్ని అమ్మిపారేసిన... ఎవుసమే బందయితే అవుండి ఏం జేస్తయి? ఎడ్లు బండి మాత్రముంచుకున్న... బండిగొట్టుకుంట బతుకుతక్కడ...'' అన్నాడు గట్టయ్య.

''నాకు సుతారిపని వచ్చుగద. ఆ పని జేసుకుంట బతుకుత...''

''నేను రిక్షా తొక్కుకుంట బతుకుత... పాతదో కొత్తదో కొనుక్కోవాలె...''

''నేను తీరందాజ్ టాకీసు దగ్గర గేటుకీపరు నౌకరి మాట్లాడుకున్న...''

ఊళ్ళో పెద్దగా భూవసతి లేనివాళ్లు, కూలి చేసుకుంటూ బతికేవాళ్లు కొంతమంది కరీంనగర్‌లో స్థిరపడి బతకడానికి సిద్ధమయ్యారు. ప్రకృతి తల్లి ఒడిలో బతకడానికలవాటుపడ్డ ఆ జనాలు ఒకర్ని పట్టుకొని ఒకరేడుస్తూ ఊరొదిలారు. పట్టణంలోని మురికివాడల్లో జాల్లర్ల పక్కన, ఊరుకు మైళ్ళ దూరంలో కాపురాలేర్పరచుకున్నారు.

అప్పటికింకా జిల్లాలో ఉద్యమాలు ప్రారంభంకాలేదు. ఊళ్లో ఎక్కువ భూములున్న వాళ్లు దొరల కుటుంబాల వాళ్లు, రెడ్లు, వెలమ కులాలకు చెందిన సంపన్న కుటుంబాలవాళ్లు చాలామంది వచ్చిన డబ్బుతో కరీంనగర్‌లో బంగ్లాలు కట్టుకున్నారు. వ్యాపారాల్లో పెట్టుబడులు పెడ్తున్నారు. కొందరు షాపులు తెరిచారు.

రోజురోజుకూ ఊరు ఖాళీ అవుతుండటం చూస్తూనే ఉన్నాడు వెంకటనర్సయ్య... వెళ్లిపోతున్న వాళ్లను ఊర్లో ఉన్నవాళ్లు ఊరి చివరివరకూ పోయి సాగనంపి వస్తున్నారు... కొంతమంది జగిత్యాల పెద్దపల్లిలో బతకడానికి వెళ్లారు...

''నేను పుట్టింది పెరిగింది తరతరాలుగా బతుకుతున్నది వ్యవసాయంతోనే... నాకు వ్యవసాయమంటే ప్రాణం... అది తప్ప నాకేపని రాదు... జగిత్యాల దిక్కు మంచి వ్యవసాయ భూములున్నాయి. కరీంనగర్ దాటింతర్వాత నిజామాబాద్ దిక్కుపోతుంటే పచ్చని చేండ్లు, పొలాలు మంచి భూములు కనబడతాయి. పోచంపాడు నీళ్లు గూడా అటే ముందు వస్తున్నయట... నేను జగిత్యాల దగ్గరున్న ఊళ్ళో భూమి కొనుక్కుంటున్న... నేనటేపోతన్న... మనకేం గోసలచ్చె బిడ్డలార... మనమిగ ఎప్పలం ఎట్ల కలుసుకుంటామో తెలువది...'' అందరినీ బిగియారా కౌగలించుకొని కండ్ల నీరు తీసుకుంటూ వెళ్లిపోయాడు నర్సింహులు తాత. ఇక ఆడవాళ్ల శోకాలకైతే అంతేలేదు...

'వెంకటనర్సన్నా? మాకు సుల్తానాబాద్ దగ్గరున్నూల్లెచుట్టాలున్నరు... అక్కడ మా కులపాయనె

సరుపంచి. నాకింత భూమి జూసిండు. నాక్కొన్నిగొర్లున్నయిగద... ఇంకొన్ని కొనుక్కుంట. అక్కన్నే ఉంట... ఎల్లనో పిల్లల సాదుకుంట. మనకెన్ని కష్టాలచ్చె బిడ్డలారా...! పెద్ద మల్లయ్య గుట్ట, ల్యాగల బోరు, బోడగుట్టలకు తింపుకుంట గొర్లు మేపుకునెటోన్ని... నాగొర్లు తిరిగిన భూమి ఇంచించు తెలుసునాకు...'' కరువుల కాలంల ఆదుకున్నదూరు... ఈ పరిస్థితి ఎవ్వలకు రావద్దు బిడ్డలారా...'' గొడగొడా ఏడ్చుకుంటూ వెళ్లిపోయాడు గొల్ల ఓదెలు...

కులాలేవైనా వరుసలు పెట్టుకొని ఆప్యాయంగా పిలుచుకుంటూ ఒకరి కష్టసుఖాల్లో మరొకరు పాలుపంచుకుంటూ ఉండే గ్రామీణులు ఒక్కొక్కరు వెళ్లిపోతుంటే ఆవేదన చెందుతున్నాడు వెంకటనర్సయ్య...

''కాపుదన పోల్లున్న ఊరు మనది... కులాలెన్నున్నా చాలామంది రైతుబిడ్డలే... భూమిని నమ్ముకొని బతుకుతున్నోళ్ళే... మానకొండూరుకు దగ్గరున్న ఊళ్లె పొలాలు ఏరుపారుకానికున్నయి... ఆ ఊరుకు మా చెల్లెనిచ్చినం గద...! అలిగి అత్తగారింటికి చెడి, చెల్లెలింటికి పోవద్దన్నరు పెద్దలు... కాని నాకు మా చెల్లెలూరికి పోక తప్పుతలేదు.. పోతన్న బిడ్డలార... మనం ఒగల్నొగలం మరువద్దు. ఎక్కడనన్న కల్సుకున్నప్పుడు మంచిగ మాట్లాడుకుందాం...'' చెల్లెలూర్లో స్థిరపడటానికి పోతూ దుఃఖంతో అన్నాడు కేశవులు...

ఇద్దరు పురోహితులు ఊర్ను వదిలివెళుతూ కడుపు తరుక్కుపోయేట్టు ఏడ్చారు.

'అక్కడుండి ఏం జేసి బతుకుతవు? అడిగాడు పట్వారి.

''ఊరె మమ్ములను పోషించింది. ఇన్నోజులు నాలుగు మంత్రాలు చదివి మీ అందరి ఆదరణతో పొట్టబోసుకున్నం. ఇప్పుడు ఊరు వెళ్లి పొమ్మంటుంది. ఎలా బతకడమో ఏమో...?'' అన్నాడు శీనయ్యపంతులు కంట తడిపెడుతూ..

''మీకేంది పంతులు...? పంచాంగం చేతులుంటె చాలు ఎక్కన్నైన బతుకచ్చు..'' అన్నాడో రైతు...

''మీ నోటి చలువ వల్ల అలాగే కానియ్యి...'' అంటూ వెళ్ళిపోయారు వాళ్ళు...

రెండేండ్లలో ముప్పాతిక జనం ఖాళీ చేసారు. ఇండ్లు విప్పి తీసుకెళ్లారు.. విప్పిన ఇండ్లతో ఊరంతా పాడుబడ్డట్టుంది...

వెంకట నర్సయ్యకు నడివయసు దాటుతుంది...

''నా ఊర్ను, పొలంను విడిచిపెట్టి నేనెలా రావాలి బిడ్డ...? నాకు చూపిన పరంపోగు బీడును దున్నుటానికి నా రక్తమాంసాలు ధారబోసిన... నాలుగైదేళ్లు కష్టపడితె అదో రేవుకొచ్చింది... ఆ తర్వాత దానికి నీటి వసతొచ్చింది.. ఆ భూమిలో నా చెమటుంది. రక్తముంది... నా ఊపిరే వుంది... నాకా భూమంటే పంచ ప్రాణాలు.... నేనా భూమిని వదిలిపెట్టి అసలేరాను...'' అన్నాడు, ఊరు వదులుదామన్న కొడుకులతో..

''బాపూ! అందరూ ఇండ్లు విప్పుకొని అయిన వరకు తీసుకొని ఏదో ఊళ్ళో స్థిరపడటానికి వెళ్ళిపోతుంటే నువ్వేమొ ఇక్కన్నే ఉంటనంటావేంటి...? ఇది మూర్ఖత్వం కాకుంటేమవుతుంది...? ఇంకో ఆరు నెలల్లో నీళ్ళు మన ఊరివరకొస్తాయట... ఇది సర్కారు పని... మనం తొందరగా వెళ్లిపోవాలి...'' అన్నాడాతని పెద్దకొడుకు...

''సర్కారైతే తలదీసి మొలేత్తరా... నేను రాను...'' దృఢంగా అన్నాడును...

''నాన్నా! ప్రభుత్వంతో ఎంతో కొంత లాభపడ్డం మనం... అయినా మీరిలా అంటున్నారు.. మనం వినకుంటే బలవంతంగా ఖాళీ చేయిస్తరు. మెడపట్టిగెంటించుకోవడం మంచిదా?'' అన్నాడు రెండో కొడుకు.

''ఊర్ను విడిచిపెట్టినోల్లంత మనుషులుగారా...? నాలుగు వందల కడుపున్న ఊరిపుడు శ్మశానమోలయింది... నలభై యాభైమంది మిగిలిండ్రు. వాళ్లు కూడ పోవుటానికి సిద్ధంగున్నరు... మనకు పైసలు గూడచ్చె. ఎందుకీ మూర్ఖపు పట్టు...''

కొడుకు లెంత చెప్పినా వినడంలేదు వెంకట నర్సయ్య...

''మీరేమన్న చెప్పండ్రి... నేనీ ఊళ్ళోనే ప్రాణమిడుస్తా...''

మూడు నెలలకాలంలో మూడవసారి వచ్చాడాతని తోడల్లుడు... ఆతనిది గోదావరిఖని ప్రాంతానికి కొంచెం దూరంలో వున్న మాేడుపాక గ్రామం...

''వెంకటనర్సన్నా! నీకీ ఊళ్లో తప్ప ఎక్కడా ఉండడం ఇష్టం లేనట్టుంది... నిజమే... పుట్టిపెరిగిన నేలను వదిలిపోవాలంటే ఎవరికైనా కష్టమే... కాని కాలం మనది కానప్పుడేం చేయడం? మీరు మా ఊరు వచ్చేయండి. ఇల్లు కట్టుకునేంతవరకు మా ఇంట్లోనే ఉండండి... మావి చాలా మంచి భూములు. ఈ ఊరి వాతావరణమే మా ఊళ్లోనూ ఉంటుంది. మా ఊరు గూర్చి నీకు తెలియదనికాదు. వ్యవసాయానికనుకూలమైన భూములు... ఎన్రోజులున్నా ఖాళీ చెయ్యక తప్పనప్పుడు ఇంకెందుకుండటం?'' అని పోవాల్సిన అవసరాన్ని గూర్చి రకరకాలుగా చెప్పాడాతని షడ్డకుడు... ఆతని మాటలమీద కొంత గురుంది వెంకటనర్సయ్యకు... పోగా ఆ ఊరంటే అతనికిష్టమే. అయితే ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో బొగ్గుగనులు పడుతుండటం గూర్చి అడిగాడు షడ్డకున్ని...

''బావులన్నీ గోదావరి నది ఒడ్డునుంచే పోతున్నాయి. జనగామ ఊర్నుంచి గోదావరినదివెంట మంథని దిక్కు బొగ్గున్నదట... బొగ్గుబావులు మా ఊరి దిక్కేం రావు... మా ఊరేం బోదు... మనం బేఫికర్‌గా ఉండవచ్చు... మంచి భూములు. వ్యవసాయమున్న ఊరు... కూరగాయలు పండించుకున్నా గోదావరిఖనివెళ్లి అమ్ముకొని బతుకొచ్చు... నీ నలుగురు కొడుకుల్లో ఒకరిద్దరికి బావి పని కూడా చూడొచ్చు. నీకేం భయం లేదే అన్న. నూటికి చెల్లుగ నేనున్నగద... ! వచ్చిన డబ్బుతోని పొలం కొనుక్కుందాం... ఇల్లు కట్టుకుందాం... నువ్వు కాదనకిగ...'' చెవుల్లో ఇల్లు గట్టుకొని పోరినట్టుగా చెప్పగా చెప్పగా కొంత మెత్తబడ్డాడు వెంకటనర్సయ్య.

''సరేగాని మా ఇల్లుకిల్లు వచ్చి మీ ఇంటిమీద పడితెట్లుంటుంది? మాదేమన్న చిన్నకుటుంబమా...? ఏం మంచిగుండదు...'' అన్నాడు వెంకట నర్సయ్య.

''అట్లయితే మా కొట్టంలో ఉండండి... దాన్ని మంచిగ చేయించుత... ఎడ్లకోసం చిన్న గుడిసేపిస్త మీరచ్చేవరకు... మీరు మా ఇంట్లుంటె నాకు భారమానె... మీ ఇష్టమెట్లుంటె అట్ల చేయండ్రి...''

ఇంకెన్నో ప్రశ్నలేసిన వెంకట నర్సయ్యను సముదాయించి ఒప్పించాడాతని షడ్డకుడు... ఊరు విడిచిపోదామనుకున్న తర్వాత ఆతనికి భూములపై మరింత ప్రేమ పెరిగింది.. రోజూ భూముల్లోకెల్లి

తిరిగొస్తున్నాడు... మట్టిని తీసి కళ్ళకద్దుకుంటున్నాడు.

ఇల్లును విప్పి ఉపయోగపడే సామాన్లు ఎడ్లబండ్లలో వేసుకొని ఊరొదిలి పోతున్న రోజున అతని కడుపు చెరువే అయింది... ఆ ఇంటి వాళ్ళంతా కంటికో కడివెడుగా ఏడ్చారు... ఊళ్లో ఇంకా మిగిలిన పదిహేన్నెండు కుటుంబాలవాళ్లను హృదయానికి హత్తుకున్నారు... ఊరును దాటి ముందుకు పోతుంటే ఎన్నెన్నో జ్ఞాపకాలు సుళ్ళు తిరుగుతుండగా వెనుకకు తిరిగి చూస్తూ పొలాలకు, చెట్లకు, చేనులకు, గుట్టలకు, కాలువలకు కన్నీళ్ళతో వీడ్కోలు చెబుతూ ఊరొదిలాడు. ఊరి పొలిమేర దాటుతున్న సమయంలో మరోసారి భోరుభోరున ఏడ్చాడు... పొలిమేరలు దాటి పోతున్న వెంకటనర్సయ్యకు పాలిచ్చే తల్లి ఆవునుండి లేగదూడను బలవంతంగా లాక్కెళుతున్నట్టుగా అనిపించి మరోసారి దుఃఖం పెల్లుబికి వచ్చింది.

★ ★ ★

''అప్పారావ్! అలా మా ఊర్ను మానేరు ముంచేసింది. మా ఊరివాళ్లందరినీ చెట్టుకొగలను, పుట్టకొగలను చేసినట్టు తరిమేసింది. మా బతుకులను చిల్లరగత్తురం చేసింది... మా బంగారం లాంటి భూములు, మేం పుట్టి పెరిగిన ఇండ్లు, మేం ఆడినపాడిన ప్రదేశాలన్నీ నీళ్ళలో మునిగిపోయాయి. మా మధ్యనున్న సంబంధాలు, అనుబంధాలు అన్నీ కకావికలై పోయాయి. నేలతో ఏర్పరచుకున్న ప్రేమా మసైపోయింది... నా ముగ్గురు తమ్ములు వేరువేరూళ్ళలో బతుకుతున్నారు... పారిశ్రామిక వాసనలకు ఆమడదూరంలో వున్న నా బంగారు ఊరు పేరుకు లేకుండా పోయింది. ఇవన్నీ కోల్పోయి మేం పొందిన డబ్బు స్వల్పమే... మా భూముల కేసులు చేస్తూ కరీంనగర్ వకీల్లు లక్షలు, కోట్లు సంపాదించారు. వకీల్లు ఆ కేసులను తిరుగతోడుతూ ఇంకా బలుస్తూనే వున్నారు... మాకు అపుడు కొన్ని ఇపుడుకొన్ని ఇంకా డబ్బులు వస్తూనే వున్నాయి...'' వెంకటనర్సయ్య నాసికాపుటాల నుండి దీర్ఘ నిట్టూర్పు వెలువడింది.

అప్పారావేం మాట్లాడకుండా మిత్రుని మాటలగూర్చే ఆలోచిస్తున్నాడు... ఈ విషయాలన్నీ వెంకటనర్సయ్య ద్వారా కొన్నేళ్ళ క్రితం విన్నవే అయినా ఇప్పుడు వింటున్న అతని హృదయం బరువెక్కుతుంది. అతని మనసుకెక్కడో గాయమవుతుంది.

''మొదట మా షడ్డకునింట్లోనే వున్నాం. రెన్నెళ్ల తర్వాత ఎడ్లకొట్టంలోకి మారాం... ఆరేడు నెలల్లో ఇల్లు కట్టుకున్నాం... నా నలుగురు కొడుకులకూ సరిపోయేట్టు ఇల్లు పెంచాను. చిన్నోడు బావిపని దొరికించుకున్నాడు. మిగతా ముగ్గురు వ్యవసాయం వృత్తిగానే బతుకుతున్నారు. నా పెద్ద కొడుకు తాతయ్యాడు కూడా.

మేమిక్కడి కొచ్చినప్పుడు ఎఫ్‌సిఐ ఫ్యాక్టరీ లేదు... ట్యూబ్‌లైట్లతోని జిగేలుమంటున్న ఎన్టీపీసీ లేదు. ఈ ఓపెన్‌కాస్టులు లేవు... ఈ ప్రదేశమంతా పచ్చని పొలాలతో నుండేది... ఇక్కడ పక్షుల కిలకిలా రావాలుండేవి... పశువుల గిట్టల చప్పుడుండేది. పచ్చపచ్చని చెట్లుండేవి. మరిప్పుడు? ఎక్కడ చూసినా మట్టి దిబ్బలు... బూడిద కుప్పలు... బొగ్గు గుట్టలు... మాడి మసైపోతున్న చెట్లు..

మా ఊర్ను నీళ్లు ముంచేసాయని ఈ ఊరుకొస్తే ఈ ఊర్ను బొగ్గుగనులు ముంచేస్తున్నాయి... ముప్పయి ఏళ్లుగా నేనీ ఊరుతో ఏర్పరచుకున్న పేగు సంబంధాలనెలా తెంచుకోవాలి...?''

వేదనతో కూడిన గద్గద స్వరంతో చెప్పుకొస్తున్నాడు వెంకటనర్సయ్య...

''వెంకటనర్సయ్యా! పుట్టీ పెరిగిన నేలను శాశ్వతంగా వదలిపెట్టి పోవాల్సిరావడం నిజంగా పెద్ద శిక్షలాంటిదే. అయితే పొట్టగడవక బతుకు తెరువును వెతుక్కుంటూ పోవడం సంగతి వేరు... ఈ తరం వాళ్ళ ఆపేక్షలు లక్షలు కోట్లకు పడగెత్తాలని పడే వెంపర్లాటలు మాత్రం బాధను కల్గిస్తున్నాయి... వీళ్ళీదేశాన్ని, ఈ భూగోళాన్ని ఏం చేయదలచుకున్నారో నా కర్థం కావడంలేదు. మా జిల్లాలోని వ్యవసాయ భూములెంత సారవంతమైనవి? బంగారం పండే భూములే కదా అవి చాలావరకు... అందులో పండుతున్న పంటలు, ఆదాయం చాలదా వాళ్లకు? వీళ్ల ఆపేక్షః పాడుగాను... సారవంతమైన బంగారం లాంటి భూముల్లో చేపల చెరువులు తవ్వి నాశనం చేస్తున్నారు... ఒకేసారి కోట్లు సంపాదించాలన్న దుర్బుద్ధి కాకుంటే ఏంటిది? వాడెవడో దురాశాపరుడు రోజుకో బంగారు గుడ్డును పెడ్తున్న బాతును కోసినట్టు చేయడం కదా ఇదంతా? తర్వాత ఆ భూములు దేనికన్నా పనికొస్తాయా? భూములను మందులమయం చేస్తూ సర్వనాశనం చేస్తున్న దుర్మార్గాన్ని ప్రోత్సహిస్తున్న వాళ్లూ వున్నారు. వాళ్లకు నోట్లకట్టలేకాని భవిష్యత్తు గూర్చిన చింత కనబడదు... ఇదిలాగే కొనసాగితే ఆంధ్రదేశపు ధాన్యాగారం చవిటిపర్రగా మారిపోయే ప్రమాదముంది...''

అప్పారావా మాటలంటున్నప్పుడు అతని కనుకొలుకుల్లో నీటి చుక్కలుండటం చూసాడు వెంకటనర్సయ్య.

చేతుల్లో తుపాకులు పట్టుకొని దగ్గరికొస్తున్న పోలీసులను చూసి లేచి నిల్చున్నారా వృద్ధులు.

''అరేయ్... ముసలోల్లు... ఈ సమయంలో ఇక్కడెందుకున్నారు మీరు...? నక్సలైట్ల కేమన్న సమాచార మందించడానికొచ్చారా? ఇప్పుడెవర్నీ నమ్మచ్చేట్టులేదు. మిమ్మల్ని చూస్తుంటే వాళ్ల మనుషుల్లాగే కనబడ్తున్నారు.'' అన్నాడందులో ఓ కానిస్టేబుల్...

ముంచుకొస్తున్న కొత్త విపత్తును చూసి వణికిపోయారా వృద్ధులు... ఆ పేరు మీద పోలీసుస్టేషన్‌కు తీసుకెళితే జరిగేదేంటో వాళ్లకు తెలుసు...

''కాటికి కాళ్లు చాసుకొనున్న మమ్మల్నిలా అనడం ఏం బాగుందిసార్? ఊరు సింగరేణి కింద బొగ్గుమయమై పోతుంది కదా...? భూముల్ని చూసుకుందామనొచ్చాం.. ఇంకొద్ది రోజులైతే ఇవ్వికూడా కనబడవుకదా!'' అన్నాడు వెంకటనర్సయ్య.

ఆ వృద్ధులను చూసి వాళ్లేమనుకొన్నారో ఏమో తమ సహజధోరణికి భిన్నంగా ''పొండ్రి... పొండ్రి అన్నలకోసం తిరుగున్నం... ఎప్పుడేమవుతుందో తెలియకుంటున్న దిక్కడ వెళ్లిపొండ్రి...'' అని బూట్ల చప్పుడు చేసుకుంటూ వెళ్లిపోయారు.

ఆ వృద్ధులిద్దరూ ఊరు టక్కు నడుస్తున్నారు. చుట్టలంటు బెట్టుకున్నారు. బొంయ్ బొంయ్ మంటూ బొగ్గుపోసే ధ్వనులు... పేలుళ్ల చప్పులు వింటున్నారు.

''అప్పారావ్...? ఈ ప్రాంతంలో మనం రోజుకో హత్యనో, బాంబు పేలుడునో ఎన్‌కౌంటర్‌నో చూస్తూనేవున్నాం... నిన్నగాకమొన్న ఇక్కడే ఓ శవం కనబడింది. రాజనాలు పండాల్సిననేలలో తుపాకులు మొలుస్తున్నాయి. పక్షుల కూతలు వినాల్సిన భూమిలో బాంబుల మోతలు వినబడుతున్నాయి. అంబారవాలకు బదులు (పేలుళ్ళ) చప్పుళ్లు, ఆర్తనాదాలు వినాల్సి వస్తుంది.''

''బాగా చెప్పావు వెంకటనర్సయ్యా! ఇక్కడిప్పుడు పంటలకు బదులు బొగ్గు పండుతుంది... వస్తున్న మార్పులు మంచికో చెడ్డకో నాకైతే తెలియదుకాని మనలాంటి వాళ్లకు మాత్రం మనస్తాపాన్ని కల్గిస్తున్నాయి...''

''అప్పారావ్! నాకు తెలీ[illegible]! ఏమనిషికైనా బతకడానికేం కావాలి? కోట్ల రూపాయలున్న వాడైనా తినేదేంటి?''

''లక్షాధికారైన లవణమన్నమేకాని వెండి బంగారంబు కుడువలేడు'' అన్నారు మన పెద్దలు... అయినా చెప్పలేని స్వార్థం...''

''అప్పారావు... నువ్వెన్నయినా చెప్పు... అభివృద్ధి పేరుమీద మానవ మనుగడనే ప్రశ్నార్థకంగా మారుస్తున్న విధ్వంసం నాకైతే తీరని మనస్తాపాన్నే కలిగిస్తుంది. అటు ప్రకృతి సిద్ధమైన అడవులను నాశనం చేస్తూ ఇటు పంట భూములను గోతుల మయం చేస్తూ మరో దిక్కు మంచి మంచి భూములను నిష్ప్రయోజనమైన విషపూరిత నేలలుగా మారుస్తూ మనిషేం సాధించ దలుచుకున్నాడు. భవిష్యత్తులో తిండి కవసరమయ్యే పంటలు పండించే నేల కూడా కరువవుతుందేమో! ఇంటినిండా బంగారుమున్నా, పట్టు వస్త్రాలున్నా, బొగ్గున్నా ఎన్ని సంపదలున్నా ఇవేవైనా మనిషి ఆకలిని తీర్చగలవా? ఏ అభివృద్ధయినా మనిషి మనుగడ సుఖ సంతోషాలతో బతికే దిశగా సాగాలి... మన మెటుదిక్కు పయనిస్తున్నట్లో నాకైతే అర్థం కావడంలేదు... అమెరికాలో మామూలైన ఆమ్ల వర్షాలిప్పుడు మన దేశంలోనూ మన ప్రాంతంలోనూ పడుతున్నట్టు వార్తలొస్తున్నాయి. భవిష్యత్తు విలయాల నెవరాపాలి...?''

వాళ్లిద్దరూ ఊళ్ళోని మూడు బజార్ల దగ్గరకి చేరుకున్నారు.

''ఏంటి? ఆంధ్ర తెలంగాణా రెండు ప్రాంతాలు స్వయంగా కలిసొస్తున్నట్టుగా నడిచొస్తున్నారు... ఎంతైనా మీ స్నేహం అపురూపమే... సరేకాని ఎటో పోయొస్తున్నారేంటి? బూడిదమయమైపోతున్న భూముల్ని కడసారిగా చూసుకొనొస్తున్నారా? రాక్షసి యంత్రాలు బొగ్గును తవ్వుతూ ఎలా గోతులు చేస్తున్నాయో చూసి వస్తున్నారా?'' నవ్వూ ఏడుపు మిళితమైన గొంతుతో అన్నాడు నర్సింహారెడ్డి...

తలలూపారు వృద్ధులు.

''ఇంటికి పోయేం జేస్తరు? అట్ల కూచోండ్రి'' రాజారామనగానే చెట్టుకిందున్న బండమీద పక్క పక్కన కూర్చున్నారా వృద్ధులిద్దరూ.

''ఇది బట్టగాల్చి మీదేసే కాలం... ఇక్కడేదో మీటింగు పెడ్తున్నారని వాళ్ళతో సంబంధముందని జీపు లేసుకపోయినా పోతరు పోలీసులు.'' అన్నాడు శంకరలింగం.

''ఇప్పుడే పోలీసు జీపటుపోయింది... ఓ దిక్కు అన్నలు... ఇంకో దిక్కు పోలీసులు... ఇవన్నీ చాలయన్నట్టు ఇండ్లు ఖాళీ చెయ్యమని నోటీసుల మీద నోటీసులు... పొమ్మంటె ఎక్కడికి పోవడం?'' అన్నాడు అప్పారావు...

''మైటింక్లైన్ దిక్కు జాగ చూపెట్టారుగద... పోతె అయిపోతుందేంటి? చాలా వరకు పైసలు గూడ రానేవచ్చె...''

''నీకేందోయ్ శ్రీనివాసు... ఒంటరిగానివి... పిల్లాజెల్లా... జాగ చూపెట్టంగనే పోయి బతుకుడెట్ల?... బాయిపని దొరికినోల్లు సరే వ్యవసాయం చేసుకుంటూ బతికేవాళ్ళేం చేయాలక్కడ?'' అన్నాడు నర్సింహారెడ్డి.

''అటు ఎఫ్‌సిఐ ఫ్యాక్టరీపడి అటు తర్వాత ఎన్టీపీసీ పడి చుట్టుపక్కల గ్రామాల వాళ్ళంత భూములు

కోల్పోయారు... ఆ ఫ్యాక్టరీల నుంచి వచ్చే విషవాయువులు దుమ్ము, దూళి, పొగపీల్చేది మనం. ఫ్యాక్టరీల నుంచి వచ్చే విషపూరిత నీళ్ళు తాగి మన బర్లు, గొర్లు చస్తయి..''

''అవును... చుట్టుపక్కల ఊళ్లవాళ్లు ఆ ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్నది చాలా తక్కువ మంది... ఈ పరిశ్రమలేంటో? ఈ తతంగమేంటో? మన దేశంలోని నదులెంతో పవిత్రమైన వన్న అభిప్రాయముంది... అయితే ఇప్పుడన్ని నదులూ కలుషితమవుతున్నాయి... గంగ, గోదావరులైతే మరింతెక్కువగా... ఇదంతెక్కడికి దారితీస్తుంది?'' అన్న రాజు మాటలతో గంయ్‌మని లేచాడు కిశోర్..

''అయితే పరిశ్రమలు వద్దా? మన కేవో చిన్న చిన్న బాధలున్నాయని పరిశ్రమలే వద్దంటే దేశ ఆర్థికాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది?'' అన్నాడు.

''పరిశ్రమలు వద్దని ఎవరన్నారు? పారిశ్రామికాభివృద్ధి జరగాల్సిందే కాని ఏ అభివృద్ధయినా మానవ జీవితాన్ని సుఖ సంతోషాలతో వర్ధిల్లే దిశగా కొనసాగాలి. మానవజాతి మనుగడకే ప్రశ్నార్థకం కాకూడదు... వాతావరణాన్ని కలుషితం చేసి నీటినీ కలుషితం జేసి పీల్చుకోవడానికి కలుషితం కాని గాలి కూడా లేకుండా చేసి మనుషుల మధ్య దూరాన్ని పెంచి మానవ సంబంధాలను కృత్రిమ మయం, డబ్బుమయం, చేయడమే అభివృద్ధవుతుందా? ఏ అభివృద్ధయినా మానవత్వం పరిమళించే దిశగా సాగాలి. మానవజాతిని మట్టిపాలు చేయడానికి కాదు... యుద్ధ పరికరాలను సమకూర్చుకోవడంలో ప్రపంచ దేశాలు సాధించిన అభివృద్ధి యుద్ధమంటూ వస్తే మానవ జాతంతా తుడుచుకుపోయే ప్రమాదాన్ని పెంచింది. ఇది కూడా అభివృద్ధేకదా...''

యువకుడైన రాజు తనలో ఏ భావాలైతే కదులుతున్నాయో ఆ భావాలనే గొప్పగా చెప్పడం చూసి అతని దిక్కు ప్రశంసాపూర్వకంగా చూసాడు వెంకటనర్సయ్య.

రెండు స్కూటర్ల మీద నలుగురు మనుషులటునుంచి పోనడం చూసారు వాళ్లు...

''ఇల్లు కాలి ఒకడేడుస్తుంటే ఆ మంటకు చలికాచుకుంటున్నాడట ఇంకొగడు.. మన ఏడ్పు లాయర్లకు, పైరవీకార్లకు లక్షలు సంపాదించి పెడ్తుంది. అందుకే వాళ్ల తిరుగుళ్లు...'' పోయిన వాళ్ల నుద్దేశించి అన్నాడు నర్సింహారెడ్డి

''మానేరు కింద భూములు పోయినోల్లు ఎడ్ల ముడ్డి పొడుచుకుంటనే వేరే ఊళ్లల్లో బతుకుతున్నారు... ఆ కేసులు చేసిన లాయర్లిప్పుడు కోటీశ్వరులయ్యారు...''

''దూరంలున్న కరీంనగర్ సంగతెందుకు చెప్తుతవు వెంకటనర్సయ్య...! గోదావరి ఖని పెరుగుతున్నప్పుడు ఎన్టీపీసీ వచ్చిన కొత్తలో ఖాజిపల్లె వాళ్ల వ్యవసాయ భూములు కొన్నరు కొందరు... వాట్ని ప్లాట్లు చేసి అమ్మి లక్షలు సంపాదించారు.. వాళ్లే నాయకులయ్యారు.. ఖాజిపల్లె వాళ్లు ఇప్పటికీ పాలమ్ముకుంటూనే బతుకుతున్నారు...'' అన్నాడు అప్పారావు.

''అవును ఇది బ్రోకర్లను బతికించే సమాజం... సింగరేణి భూనిర్వాసితుల కేసులు చేసి ఓ లాయరు పదేళ్లలో అరవై డెబ్బయి లక్షలు సంపాదించడం నాకు తెలుసు... మనిషిప్పుడు డబ్బు వెంటే పరుగులు పెడుతున్నాడు... ఈ డబ్బు, వ్యాపార ఆలోచనల వల్ల పల్లెల్లో కూడా చాలా మార్పులొస్తున్నాయి... ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ధ్వంసమైంది. సంపాదనమీద ఆపేక్షమరీ పెరిగింది...''.

ముప్పయి ఏళ్లు కూడా లేని రాజుకంత పరిపక్వత ఎలా వచ్చిందో ఆ మాటలను వింటున్న అప్పారావు, వెంకట నర్సయ్యల కర్థం కాలేదు.

''హ్హా... హ్హా... హ్హా...'' అంటూ బోసుగుపినట్టు నవ్వాడు మల్లారెడ్డి.

''నాకైతే మా అత్తగారింటికి పోతె మస్తు సంబరమనిపించేది. నేంబోతె అందరం కూచోని సంతోషంగా మాట్లాడుకునెటోల్లం... ఇంట్లున్న దేది తిన్నా ప్రేమను రంగరించి పెట్టినట్టనిపించేది. మా మామ బతికున్నన్ని రోజులందర్ని ఒక్కమూటి మీదుంచిండు.

ఇప్పుడా ఇంటి ముఖమే చూడబుద్ధయితలేదు.... ఐదుగురు బావమరుదులైదు తీర్ల మొకాలు పెడతరు... పెండ్లాలతోని గుసగుసలు. మంచిగ మాట్లాడితె ఓ పూట తిండి పెట్టవలసస్తుందనేమో ముఖం చాటేసుకుంటారు... మాట్లాడినా ఆ మాటలు పెదవులు దాటి బయటకు రావు. ఒకర్ని మించి ఒకరు సంపాదించాలన్న దుర్ధ... ఏదో మా అత్తమ్మ బతికున్నన్ని రోజులలా పోతాం... ఆ తర్వాతటు ముఖం చూపకున్నా బాధపడే వాళ్లు లేరు...''

'నలుపయేండ్లు దాటినా మల్రెడ్డికి అత్తగారింటికి పోయి కోళ్లు కోయించుకోని తినాలనున్నది. బామ్మరుదులు చాలుగాల్లు...'' అన్నాడు కిశోర్ నవ్వుతూ.

''వాళ్లేదో పెడితే తిందామనో కట్నాలు కానుకలు దొబ్బుదామనో కాదు పోయేది. నీ లాంటి వాళ్ళు కల్ల ఉంటదేమో... ఎంత ఎయిసొచ్చినా స్త్రీకి తన రక్త సంబంధీకుల మీద ప్రేమ చంపు ఉంటుంది. మనుషుల నడుమ సంబంధం తెగిపోకుండ ఉండటానికే ఈ రావడాలు పోవడాలు...'' అన్నాడు మల్లారెడ్డి

ఎరువుల ఫ్యాక్టరీ నుంచి స్టీమ్‌వెంట్‌చేస్తున్న ధ్వనులు, బొగ్గులారీలు పోతున్న ధ్వని, పేలుడు ధ్వనులు వినబడుతునే వున్నాయి.

''ఇది నిజంగా జరిగిన సంఘటన. ఓ పత్రికా సంపాదకుడు ఓ సమావేశంలో చెబితే విన్నాను... ఆతని దగ్గరికో అమెరికా అమ్మాయి. ఏదో పరిశోధన విషయం గూర్చి వచ్చిందట. ముప్ఫయి ఏళ్లు దాటుతున్న ఆమెను ఇంకా పెళ్లెందుకు చేసుకోలేదమ్మా అని అడిగాడటతను నాకు పిల్లలయితే ఎవరు చూసుకుంటారు అన్నదటామె. ఎందుకు మీ తల్లిదండ్రులు చూసుకోరా అన్నాడతను. వాళ్లెందుకు చూసుకుంటారు... ఎవరి పనులు వాళ్లవే అన్నదటామె. ఆ మాటలు విని ఆ సంపాదకుడు నీకు కాన్పు నేను చేస్తాను తల్లీ పెళ్లి చేసుకో అన్నాడట. ఆమె కళ్లు చెమర్చాయట. ఇవీ డబ్బునే బాగా ప్రేమించే దేశాలలోని సంబంధాలు. పరిస్థితులను చూస్తుంటే ఈ విషయంలో మనమూ వాళ్లలాగే తయారవుతున్నా మనిపిస్తుంది'' అన్న రాజు దిక్కు ప్రేమగా చూసాడు వెంకటనర్సయ్య.

సమాజంలో వస్తున్న మార్పులు కొన్ని ఆహ్వానించదగ్గవే అయినా మానవ సంబంధాలు మాత్రం క్రమక్రమంగా తుత్తునియలవుతుండటమాతనికి నచ్చడంలేదు.

''ఇంతకుముందు పల్లెల్లో జనాలు ఒకరి ఆపదల్లో ఒకరు ఆదుకునే వారు... ఒకరికొకరకొకరన్నట్టుండేవారు. కులాలు, మతాలు, వర్గాలకతీతంగా మనుషుల మధ్య ఓముడి లాంటిదుండేది. కాని క్రమక్రమంగా మనుషుల్లోని సహజీవనం, ప్రేమలు, బంధాలు ఒక్కొక్కటే తెగిపోతున్నట్టనిపిస్తుంది...'' అన్నాడు.

''ఇక్కడ ఒకప్పుడు చల్లని గాలుండేది... మంచి ప్రశాంతతుండేది. మంచి వర్షాలుండేవి. నాకు తెలిసీ కరువుకాలంలో మిగతాచోట్ల వర్షాలు లేని సమయంలో గొర్రెలను మేపుకుంటానికి వేరే ప్రాంతాలనుంచి ఇక్కడికివచ్చేవారు. ఈ మంథని ప్రాంతమంటేమంచి వర్షాలుపడే ప్రాంతమని అనేవారు.

మరిప్పుడు...? జీవనది గోదావరి పక్కనే వున్న గ్రామాల్లోనూ బావినీళ్లు పాతాళంలో వుంటున్నాయి. కొన్నిచోట్ల అవీ దొరకడంలేదు. గోదావరి పక్కనున్న పెద్దంపేట గ్రామంలో నీళ్లు దొరకడంలేదని ప్రజలాందోళన చేస్తుండటం మనం పేపర్లో చూస్తున్నాం...'' అన్న అప్పారావు దిక్కు కొంత చిరాకుగా చూసాడు కిశోర్.

''మీవి వెనుకటి తరం ఆలోచనలు... మీ తరంలో లాగే ఎప్పుడూ ఉండాలంటే ఎలా నడుస్తుంది? మీ తరం వాళ్లకు ఆలోచన తక్కువని ప్రతి తరం వాళ్లూ వాళ్ల పిల్లలనంటూనే ఉన్నారు. రోజురోజుకూ సైన్సు ఎంతో అభివృద్ధి చెందుతుంది. పరిశ్రమలూ పెరుగుతున్నాయి. పరిశ్రమలవల్ల ఏవో కొన్ని నష్టాలున్నాయని వాటిని వద్దంటే దేశాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? మీరన్నట్టు జరుగుతే ప్రపంచం వున్నచోటే వుంటుంది. ఊరు పోతుందని ఏదో కొంపలు మునిగిపోతున్నట్టు చేస్తున్నారు మీరు... ఎక్కడో ఓ చోట బతకరాదా ఏంది... బతుకుతలేరా?''

కిశోర్ మాటలు మరీ బాధ కల్గించాయా వృద్ధులకు.. ఏళ్ల తరబడి భూమితో ఏర్పరచుకున్న సంబంధాలనంత తేలిగ్గా ఎలా తెంచుకుంటారో వాళ్లకర్థం కావడంలేదు. భూమితో, ఉత్పత్తితో సంబంధమున్న తనలాంటి వాళ్లు బాధపడ్తుంటే యువకుల్లోని కొందరు, చదువుకొని ఉద్యోగాలు చేస్తున్న వాళ్లు, వ్యాపారం వృత్తిగా బతికేవాళ్లు పెద్దగా భావించకపోవడం గమనిస్తున్నారు వాళ్లు. వాళ్లిద్దరూ లేచి నిల్చున్నారు.

''పరిశ్రమలు వద్దని, అభివృద్ధి వద్దని ఏమనడంలేదు మేము. మా భావాలు, అభిప్రాయాలు మీకు చాదస్తంగా కనబడవచ్చు. కాని ఏ అభివృద్ధయినా మనిషి కనీసావసరాలు కొరత లేకుండా తీరే దిశగా సాగిపోతే చాలదా? ప్రపంచాన్ని భూగోళాన్ని బుగ్గి చేస్తేనే అభివృద్ధంటారా?

ఊర్ను, భూములను వదిలిపెడితే మీకెందుకు బాధుంటుంది? భూమితో మమేకమున్న వాళ్ళకుంటుంది. నేలతో, ఊరితో సంబంధాలను మేం మీ అంత త్వరగా తెంచుకోలేం... అదుగో వినండి బుర్ బుర్ అంటూ పోయే మోటార్ల చప్పుడు. బొళబొళా ధ్వనులు. ఇవన్నీ మీ చెవులకు ఆనందాన్నే ఇస్తున్నాయేమో కాని మాకు పిట్టల కిచకిచల చప్పుళ్లు, పశువుల గిట్టల చప్పుడిచ్చే ఆనందం ఈ ధ్వనులివ్వవు. వెళ్లిపొండ్రి. రోజుకో ఊరు తిరుక్కుంట జోరుదారుగా బతుకుండ్రి. ఏడిండ్ల పిల్లికూనలోలె బస్తీబస్తీ తిరుగుండ్రి. పొట్టకూటికోసం కొందరు, లక్షలు సంపాదించాలని ఇంకొందరు ఊళ్లు, జిల్లాలు, రాష్ట్రాలు దేశాలే దాటిపోతున్న మీ తరానికి ఇదో లెక్క. పొండ్రి... మా కూళ్ళుంటేనే ప్రాణం...'' అని కళ్లనీళ్లు తుడుచుకుంటూ అక్కడ్నించి వెళ్లిపోయాడు వెంకటనర్సయ్య. అతనితోపాటు అప్పారావూ వెళ్లిపోయాడు. తన ఇల్లు రాగానే అప్పారావాగాడు...

ఒంటరిగా ఇంటిదిక్కు నడుస్తున్న వెంకటనర్సయ్య నాలుకమీద ''తన చరిత్ర తనే పఠించి ఫక్కున నవ్వింది ధరణి తన గాథను తనె స్మరించి భోరున ఏడ్చింది ధరణి...'' ఎప్పుడో ఎక్కడో చదివిన వాక్యాలు తిరుగుతున్నాయి.

''అవును... తనను పగలదీయ చూస్తున్న భూదేవి నిస్సహాయంగా ఫక్కు ఫక్కున నవ్వుతుంది. భోరుభోరున ఏడుస్తుంది... తనలో తానుకుంటూ ఇంటికెళ్లాడు.

వాకిట్లో వాల్చున్న మంచంలో పడుకున్నాడు. తండ్రి ముఖం గంభీరంగా ఉండటం చూసి వెంకట నర్సయ్య కొడుకులెవరూ అతనితో మాట్లాడటానికి సాహసించలేదారోజు.

తెల్లవారినుంచి ఎప్పట్లాగే వూర్ను వదిలిపెట్టి పోవాల్సిన అవసరాన్ని గూర్చి తండ్రితో చెవిలో ఇల్లుకట్టుకొని చెప్పినట్టు చెప్పుతూనే వున్నారు... అయినా వెంకట నర్సయ్య వినడంలేదు.

''నాన్నా! మన భూములిప్పటికే ఓపెన్‌కాస్ట్‌కింద చాలావరకు పోయాయి. నువ్వేమో ఎంత చెప్పినా వినడంలేదు. నువ్వీ ఇంట్లోనే చావు... మేంవెళ్లిపోతాం... మా ఇష్టమున్నచోట ఇండ్లు కట్టుకుంటాం...'' నిష్ఠూరంగా కోపంగా అన్నాడు పెద్దకొడుకు...

కొడుకులంతా తమ ప్రయత్నాల్లో తామున్నారు.

రెండవసారి కూడా ఇక ఊర్ను వదలడం తప్పదనుకున్న వెంకటనర్సయ్య జబ్బు పడ్డాడు... వయసుతోపాటు వచ్చిన బలహీనతతోపాటు ఊరొదలాలన్న బెంగ అతన్ని మంచం పట్టించింది. ఊర్ను ఖాళీ చేయాలని ఒత్తిళ్లు వస్తూనే వున్నాయి... ఇప్పుడూరు ప్రక్కనే బొగ్గు తవ్వుతున్నారు.

మంచంలో పడుకున్న ఆ వృద్ధుడికి భూమిని పగులదీస్తూ బొగ్గు తోడుతూ పోతున్న దృశ్యాలుకళ్లముందు కదిలి తన హృదయాన్ని పగలదీస్తున్నట్టే అనిపిస్తుంది.

అతని కళ్లముందు పల్లె దృశ్యాలెన్నో కదులుతున్నాయి.

భారతదేశ గ్రామాల స్వరూపం... ప్రకృతి సౌందర్యం... అతిథి అభ్యాగతుల నాదరించే సౌశీల్యం... ఊరుమీద బతికే జానుదులు... చిందు భాగవతులు... మందెచ్చులవాళ్లు... సాధానురులు... కాటిపాపలవాళ్లు... బుడిగెజంగాలు... శారదాకాళ్లు... తోలుబొమ్మలాటగాల్లు... ఉరుకులయ్యోర్లు... గంగిరెద్దులవాళ్లు... ఎలుగుబంట్ల నాడించేవాళ్లు...ఎందరో ఇంకెందరో? వీళ్లందరికీ కెలకులనున్న తంగేటిజున్ను లాంటివాడు గృహస్థుడు.

గ్రామాల్లో అడుగుపెడుతున్న వ్యాపార నాగరికత, పెట్టుబడిదారీ వాసనలు అంతకుముందున్న సమాజంలోని సంబంధాలను ఛేదించడమే కాకుండా, ఆ సమాజంలో వున్న గుణాత్మకమైన మానవ సంబంధాలను కూడా ఛేదిస్తుండటం అతనికి తీరని వేదనను కలిగిస్తుంది.

ఎనభై ఏళ్ల మార్పులకు సాక్షీభూతంగా నిలిచిన ఆ వృద్ధుడు ధ్వంసమవుతున్న విలువలను మనుషుల మధ్య పెరుగుతున్న ఎడాన్ని జీర్ణించుకోలేక ఆవేదన చెందుతున్నాడు.

ఏవి ఆ అందాలు? ఎక్కడ ఆ ప్రకృతి రమణీయకత? ఏమయ్యాయా ఆప్యాయతలు? ఏవి... ఏవి నిరుడు కురిసిన హిమ సమూహములు? తనలో తాను అనేకమార్లను కుంటున్నాడు.

వెంకటనర్సయ్య ఇప్పుడు చివరి రోజుల్లో వున్నాడు.

కొడుకులను, కోడండ్లను, కూతుర్లను, అల్లుండ్లను, మనుమలను, మనుమరాండ్రందరినీ తన దగ్గరకు పిలుచుకున్నాడు... భార్య ఐదేళ్ల క్రితమే చనిపోయింది.

''కొడుకులారా! మీరు ఎవరెట్లా బతుకున్నా అందరొకేచోట బతుకుతారనుకుంటే అది సాధ్యం కావడంలేదు... మీ బతుకులు తాడుతెగిన పతంగులవుతున్నాయి... మీరంతా ఎక్కడెక్కడికో బతుకపోక తప్పడంలేదు... తండ్రిగా నాదొక్కటే కోర్కె... మీరంతా కనీసం ఏడాదికొక్కసారయినా పెద్దోనింట్లో కలుసుకోండ్రి.

మనసు విప్పి మాట్లాడుకోండ్రి. ఒకరి కష్ట సుఖాలొకరు తెలుసుకోండ్రి. వీలైతే ఒకరికొకరు సహాయం చేసుకోండ్రి. లేదా ఊర్కోండి. ఒకరి వినాశాన్నొకరు మాత్రం కోరుకోకండి. సోదరుల మధ్య తగాదాలవల్లనే మహాభారత యుద్ధం జరిగిందన్నది మరిచిపోవద్దు. స్వదేశీ రాజుల మధ్య ఐకమత్యం

లోపించడం వల్లనే మన దేశం పరాయి పాలనకిందికి పోయిందన్న విషయమూ మరచిపోవద్దు.

నాకు చచ్చాక వచ్చే స్వర్గంమీద, పున్నామనరకం మీదా పెద్దగా నమ్మకాలేం లేవు. కాని మీరంతా సంవత్సరాని కొకసారయినా కలుసుకుంటానికి, మీ పూర్వీకులను జ్ఞాపకం చేసుకుంటానికారోజు ఉపయోగపడుతుంది. పెద్దలకు బియ్యమిచ్చే తిథి పితరుల అమావాస్య (మహాలయ అమావాస్య) రోజున మీరంతా కలుసుకొని మమ్మలను జ్ఞాపకం చేసుకోండి... నలుగురికి చెయ్యి కడిగించండి.. మీ శక్తికొద్ది దానం చెయ్యండి... ఆరోజున మీ అక్కనూ, చెల్లెను పిలవడం మరిచిపోవద్దు...'' అన్నాడు ఒకరి చేతుల్లో మరొకరి చేతులు కలిపాడు.

తెల్లవారి శాశ్వత నిద్రల్లో కొరిగిపోయాడు వెంకటనర్సయ్య.

వెంకటనర్సయ్య శవం చుట్టూ చేరి అతని బలగమంతా రోదిస్తుంటే వస్తున్న ధ్వనిముందు యంత్రాల మోతల ధ్వని దిగదుడుపుగానే వుంది.

*వంయూరి సచిత్రవార పత్రిక 1.8.97, 8.8.97*